సమ్మక్క దేవతను దర్శించుకుంటున్న భక్తులు

వనదేవతలకు భక్తుల మొక్కులు

తాడ్వాయి,ఫిబ్రవరి10 : వనదేవతలు సమ్మక్క–సారలమ్మను శనివారం భక్తులు దర్శించుకున్నారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి తల్లులకు తలనీలాలు సమర్పించారు. నాగులమ్మ, జంపన్న గద్దెలకు పూజలు చేసి అక్కడి నుంచి తల్లుల గద్దెల వద్దకు చేరుకున్నారు. సమ్మక్క–సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలపై పసుపు, కుంకుమ, ఎత్తుబెల్లం, నూతన వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెల పరిసరాలతో పాటు ఆర్టీసీ బస్టాండ్, జంపన్న వాగు, చిలుకలగుట్ట తదితర ప్రాంతాల్లో విడిది చేశారు.

స్పెషల్ లోక్ అదాలత్‌కు భారీ స్పందన

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 10 : భూపాలపల్లి కోర్టు ప్రాంగణంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన స్పెషల్ లోక్ అదాలత్‌కు భారీ స్పందన లభించింది. ప్రిన్సిపాల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టులో ఫస్ట్ బెంచ్, అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టులో సెకండ్ బెంచ్ ఏర్పాటు చేయగా, పెట్టి, డ్రంక్ అండ్ డ్రైవ్, ఎంవీ యాక్ట్ తదితర కేసుల్లోని ముద్దాయిలు జరిమానాలు చెల్లించారు. మొత్తం 113 కేసులు పరిష్కారమయ్యాయి. ప్రిసైడింగ్ ఆఫీసర్లు ఎన్ రామచంద్ర రావు, జీ అఖిల, బెంచ్ మెంబర్లు మంగళపల్లి రాజ్‌కుమార్, వసంత, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా కుమార్ యాదవ్

గణపురం, ఫిబ్రవరి 10 : గణపురం పీఏసీఎస్ చైర్మన్‌గా కన్నెబోయిన కుమార్ యాదవ్ ఎన్నికయ్యారు. శనివారం మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో డీసీవో శైలజ సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. 13 మంది డైరెక్టర్లకు 11 మంది కుమార్‌యాదవ్‌కు మద్దతుగా చేతులెత్తారు. మరో ఇద్దరు గైర్హాజరయ్యారు. దీంతో అధికారులు చైర్మన్‌గా కన్నెబోయిన కుమార్‌యాదవ్‌ను ప్రకటించి, ధ్రువీకరణ పత్రం అందజేశారు. సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని కుమార్‌యాదవ్ తెలిపారు. కాగా, సొసైటీ వైస్ చైర్మన్‌గా ఉన్న సిరిగినేని బాబురావు తన పదవికి రాజీనామా చేశారు.

కుమార్‌యాదవ్‌కు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న డీసీవో శైలజ

అధికారులు భక్తులకు అందుబాటులో ఉండాలి

- ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి
- ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం
- చిలుకలగుట్ట పరిశీలన

తాడ్వాయి, ఫిబ్రవరి10 : మహాజాతరలో అధికారులు భక్తులకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మేడారంలోని ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నందున మరుగుదొడ్లు, తాగునీరు సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం సమ్మక్క కొలువైన చిలుకలగుట్టను పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావుతో కలిసి పరిశీలించారు. తల్లిని తీసుకువచ్చే క్రమాన్ని తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే చెప్పాలని కలెక్టర్ జగ్గారావును అడిగారు. తల్లిని తీసుకువచ్చే క్రమంలో రద్దీ అధికంగా ఉంటుందని, భక్తులు ఎగబడటంతో ఇబ్బందులకు గురవుతున్నామని, గుట్ట వద్దకు ముఖ్యమైన వారిని పరిమితి ప్రకారం పంపించాలన్నారు. ఇతరులను లోనికి పంపించవద్దని, రోప్ పార్టీ బలగాలను పెంచి తల్లిని సమయానికి గద్దెను చేర్చేలా చూడాలని ఆయన కోరారు. ఎస్పీతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ అన్నారు.

తల్లిని తీసుకువచ్చే క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులను తెలుపుతున్న పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు

మేడారంలో కొబ్బరి, బెల్లం దుకాణాల పంచాయితీ

- తమకే కేటాయించాలని పూజారులు, స్థానిక యువత డిమాండ్
- కుదురదంటున్న ఆదివాసీ సంఘాల నాయకులు

తాడ్వాయి, ఫిబ్రవరి 10 : మేడారంలో ఏర్పాటు చేసే కొబ్బరి, బెల్లం దుకాణాల కేటాయింపుల పంచాయితీ ముదురుతున్నది. ప్రతి జాతర సమయంలో పూజారులు, ఆదివాసీ సంఘాల నాయకులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో 40 కొబ్బరి, బెల్లం దుకాణాలను కేటాయిస్తారు. వీటికి లైసెన్సుల కోసం రూ.14.70 లక్షలు డీడీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే గతంలో పూజారులు, ఆదివాసీ సంఘాల సమన్వయంతో షాపులను పంచుకునేవారు. ఈసారి దుకాణాల పంపిణీకి సమావేశం నిర్వహించుకోగా స్థానిక గిరిజన అభ్యుదయ సంఘం యువకులు తమకు కూడా షాపులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. దీనికి ఆదివాసీ సంఘాల నాయకులు ససేమిరా అంటున్నారు. పూజారులకు ఇస్తున్నామని, మీకు ఇచ్చేది లేదంటూ ఖరాఖండిగా చెప్పడంతో యువకులు వాగ్వాదానికి దిగుతున్నారు. గత వర్షకాలంలో వరదల కారణంగా మేడారంలోని ఆదివాసీల ఇండ్లన్నీ మునిగిపోయి తీవ్రంగా నష్టపోయామని, తమ యూత్‌కు కూడా షాపులు కేటాయిస్తే జరిగిన నష్టాన్ని పూడ్చుకుంటామని గిరిజన సంఘం సభ్యులు చెబుతున్నారు.

ఈసారి సమావేశం ఏర్పాటు చేసి దుకాణాల కేటాయింపుపై చర్చించినప్పటికీ కొలిక్కిరాలేదు. యువతకు దుకాణాలు కేటాయించమని అనడంతో మీరు జాతరలో దుకాణాలు ఎలా నిర్వహిస్తారో చూస్తామంటూ యువకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము బాధల్లో ఉన్నప్పుడు ఏ సంఘం నాయకులు ఆదుకోలేదని, సంఘాలకు జాతరలో దుకాణాలు ఎందుకు ఇవ్వాలంటూ ప్రశ్నిస్తున్నారు.

ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలి

ములుగురూరల్, ఫిబ్రవరి 10: విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల ప్రకారంగా ఎస్‌సీఈఆర్టీలో డిప్యూటేషన్‌పై పనిచేసేందుకు జిల్లాలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో అబ్దుల్ హై శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 90100 08345 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

12న జాబ్ మేళా

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 10 : జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు భూపాలపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 12న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఆరూరి శ్యామల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు 300 మందికి మంచి పేరున్న నాలుగు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 18 ఏళ్ల పైబడి ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు, 4 ఫొటోలతో హాజరుకావాలని, పూర్తి వివరాలకు 7702457968 నంబర్‌లో సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

అనారోగ్యంతో పీఏసీఎస్ మాజీ చైర్మన్ మృతి

గణపురం, ఫిబ్రవరి 10 : ప్రజా ప్రతిఘటన నాయకుడు, రైతు కూలీ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు, గణపురం పీఏసీఎస్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ మాజీ మండలాధ్యక్షుడు రేగూరి సమ్మిరెడ్డి (55) శనివారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వరంగల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తనువు చాలించారు. ఆయన మరణవార్తతో గణపురంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా పలువురు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

ములుగు డీఎంహెచ్‌వో అప్పయ్య

వాజేడు, ఫిబ్రవరి 10 : వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలందించాలని డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య అన్నారు. శనివారం ఆయన స్థానిక పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి వైద్యాధికారులతో మాట్లాడారు. పీహెచ్‌సీలో కాన్పుల సంఖ్య పెంచేందుకు బాధ్యతతో కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారులు కొమురం మహేందర్, మధుకర్, జ్ఞానస, హెల్త్ సూపర్‌వైజర్ కోటిరెడ్డి, స్రవంతి, వైద్య సిబ్బంది ఉన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో పెనుగోలు ఆదివాసీ గిరిజనులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రగ్గులు, కిచెన్ కిట్స్, దోమ తెరలు, హైజీన్‌కిట్స్ పంపిణీ చేశారు. పెనుగోలు, పెనుగోలు కాలనీలోని 52 కుటుంబాలకు కిట్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏంపీ మెంబర్ పసుపులేటి సతీశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెనుగోలు గిరిజనులకు రగ్గులు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో అలెం అప్పయ్య

విజేతలకు బహుమతులు అందజేత

చిట్యాల, ఫిబ్రవరి 10 : నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో నిర్వహించిన పాటలు, కవితలు, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు శనివారం ఎంఈవో కోడపాక రఘుపతి బహుమతులు అందజేశారు. కాగా పాటలు, కవితలు, వక్తృత్వం విభాగాల్లో చిట్యాల జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన స్వరూప, చిరంజీవి, విష్ణువర్ధన్, చిత్రలేఖనంలో జడల్‌పేట జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని వైష్ణవి మొదటి బహుమతులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో జూకల్ హెచ్‌ఎం కృష్ణ, చిట్యాల ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీరాంరఘుపతి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, కల్పన, రహీం పాషా, రాజమౌళి, అనురాధ, సిరి, ఉస్మాన్ అలీ ఖాన్, నీలిమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహదేవపూర్ : విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

మహదేవపూర్‌లో..

మహదేవపూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల సముదాయంలో శనివారం నేషనల్ సైన్స్ డే సందర్భంగా మండల స్థాయి పోటీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు మట్టి పావని (పెయింటింగ్), ఏ విఘ్నేశ్ (ఉపన్యాసం), సాయి కార్తీక్ (కవిత్వం), పెద్ది ఐశ్వర్య (పాటలు) ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కాగా, వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు బుచ్చిరెడ్డి, సత్యం, సైన్స్ ఫెయిర్ నోడల్ అధికారి మడక మధు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాటారంలో..

కాటారం : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన వివిధ పోటీలలో విద్యార్థులు ప్రతిభ చూపారు. ఆదర్శ పాఠశాలకు చెందిన పీ వైష్ణవి (ఉపన్యాస), కాటారం ఉన్నత పాఠశాల చెందిన జీ వందన (డ్రాయింగ్), సిద్ధు (కవిత్వం), కేజీబీవీ నుంచి సుప్రియ (పాటలు) విజేతలుగా నిలువగా బహుమతులు అందజేశారు. హెచ్‌ఎంలు ఉమారాణి, కిషన్‌నాయక్, సైన్స్ ఉపాధ్యాయులు పద్మజ, సమ్మయ్య, ఆనంద్, సుధాకర్, రిజ్వానా, సుల్తానా, సడవలయ్య, సురేశ్ పాల్గొన్నారు.

కోళ్ల దుకాణాలకు తగ్గిన దరఖాస్తులు

మరో మూడు రోజుల గడువు పొడిగింపు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 10 : మేడారం జాతరలో లైసెన్స్ కలిగిన కోళ్ల దుకాణాలకు దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య తగ్గింది. ఈనెల 7లోగా దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ అధికారులు ప్రకటన విడుదల చేశారు. అయితే గడువులోగా 65 దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు తెలుస్తున్నది. గిరిజనులకే అవకాశం కల్పిస్తూ రూ.16 వేలు డీడీ చెల్లించాల్సి ఉంది. గత జాతరలో 170 వరకు అధికారులు లైసెన్స్‌లు జారీ చేశారు. ఈ సారి మాత్రం దరఖాస్తులు తగ్గడం ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. జాతర సమీపిస్తుండగా ఇప్పటికే ఎక్కడ పడితే అక్కడ కోళ్ల దుకాణాలు ఏర్పాటు చేశారు. వీటికి ఐటీడీఏ నుంచి ఎలాంటి అనుమతి లేదు. ప్రస్తుతం నడుస్తున్న దుకాణాలు యథావిధిగా కొనసాగించే ఆలోచనతో కోళ్ల దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు ముందుకురానట్లు తెలుస్తున్నది. ఐటీడీఏ, పశు సంవర్ధకశాఖ అధికారులు సమన్వయంతో మేడారంలో తనిఖీలు నిర్వహించి అనుమతి లేని షాపులపై చర్యలు తీసుకుంటే దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయి.

మరో మూడు రోజులు గడువు : పీవో అంకిత్

వందకు పైగా షాపుల ఏర్పాటుకు దరఖాస్తులు వస్తాయని అధికారులు భావిస్తున్నప్పటికీ తక్కువ రావడంతో మరో నాలుగు రోజులు గడువు పొడిగిస్తున్నట్లు ఐటీడీఏ పీవో అంకిత్ తెలిపారు. 14న సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తులను మేడారంలోని ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మహిళలు, మహిళా సంఘాల సభ్యులకు అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో ఇద్దరికి మెడల్స్

ఏటూరునాగారం, ఫిబ్రవరి 10 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని జయశంకర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో పాల్గొన్న ఏటూరునాగారం స్పోర్ట్స్ క్లబ్ చిన్నారులు మెడల్స్ సాధించారు. అథ్లెటిక్స్‌లో పీ సంజన, జ్యోతి సిల్వర్ మెడల్స్ సాధించినట్లు కోచ్ కుమారస్వామి తెలిపారు. వారిని స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు అభినందించారు.


మెడల్స్‌తో క్రీడాకారులు

గ్యాస్ సిలిండర్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

85 గ్యాస్ సిలిండర్ల స్వాధీనం : ఒకరిపై కేసు నమోదు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 10 : మండలంలోని పస్రా రెడ్డి కాంప్లెక్స్ ఆవరణ గదిలో అక్రమంగా నిల్వ చేసిన 85 గ్యాస్ సిలిండర్లను శనివారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రెడ్డి పురుషోత్తంరెడ్డి అనే వ్యక్తి గ్యాస్ సిలిండర్లు అక్రమంగా నిల్వ ఉంచారనే సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ సీఐ అనిల్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 85 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. పురుషోత్తంరెడ్డిపై పస్రా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయడంతో పాటు విజిలెన్స్ శాఖలో సైతం కేసు నమోదు చేసినట్లు అనిల్ తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ తహసీల్దార్ లక్ష్మణ్, డిప్యూటీ తహసీల్దార్లు నితీశ్, రాంచందర్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం

ములుగురూరల్, ఫిబ్రవరి 10 : గట్టమ్మ క్రాస్ వద్ద జాతీయ రహదారి విస్తరణ పనులు ఇష్టారాజ్యంగా చేపడుతుండగా మిషన్ భగీరథ పైప్ ధ్వంసమైంది. నీరు ఎగిసి పడుతుండగా మరమ్మతు చేయాల్సిన మిషన్ భగీరథ సైట్ ఇన్‌చార్జి అక్కడే ఉన్న పైప్‌లైన్ గేట్ వాల్వ్‌ను తెరిచి నీటిని వృథా చేస్తున్నాడు. ఇదేమని ప్రశ్నించిన వారిని 'పనులు జరుగుతున్నాయి కనపడటం లేదా..? పనులకు ఆటంకం కాకుండా గేట్ వాల్వ్ విప్పి పైప్‌లో ఉన్న నీటిని బయటకు పంపిస్తున్నా' అంటూ దురుసుగా ప్రవర్తించాడు. ములుగు జిల్లా కేంద్రంలో నాలుగు రోజుల నుంచి నల్లాలు రాక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఇలా నీటిని అంతా వృథా చేయడం ఏమిటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వృథాగా పోతున్న నీరు

ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

పలిమెల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పరిశీలన

పలిమెల, ఫిబ్రవరి 10 : పలిమెల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఇరిగేషన్, ఐడీసీ అధికారులు శనివారం పరిశీలించారు. ఇటీవల మండలంలో పర్యటించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పలిమెల లిఫ్ట్ పనులను పునరుద్ధరించి ఆయకట్టు రైతులకు సాగునీరందించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో వారు ప్రాజెక్ట్‌ను సందర్శించి మాట్లాడుతూ నీటి నిల్వ, మరమ్మతుల సాధ్యాసాధ్యాలను పరిశీలించామన్నారు. ప్రాజెక్టు పునరుద్ధరణకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ తిరుపతిరావు, డీఈ సురేశ్‌కుమార్, ఐడీసీ డీఈ మహేశ్‌చందర్, ఏఈఈ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కిష్టంపేటలో విద్యుదాఘాతంతో పత్తి దగ్ధం

కాటారం, ఫిబ్రవరి 10 : మండలంలోని ధన్వాడ జీపీ పరిధిలోని కిష్టంపేట గ్రామంలో శనివారం రాత్రి పొనగంటి సమ్మయ్యకు చెందిన పత్తి విద్యుదాఘాతంతో దగ్ధమైంది. ఇంట్లో ఓ గదిలో పత్తి నిల్వ చేయగా విద్యుదాఘాతంతో నిప్పురవ్వలు పడి మంటలు అంటుకున్నాయి. దీంతో సమ్మయ్య కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి మోటర్లతో నీటిని చల్లి మంటలార్పారు. సుమారు 10క్వింటాళ్ల మేర పత్తికి నష్టం వాటిల్లిందని సమ్మయ్య తెలిపారు.

మీసేవ కేంద్రాలను పరిశీలించిన ఈడీఎం

వాజేడు, ఫిబ్రవరి 10 : మండలకేంద్రంతో పాటు పేరూరు, జగన్నాథపురం గ్రామాల్లోని మీసేవ కేంద్రాలను శనివారం జిల్లా ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఈడీఎం) సామాజి దేవేందర్, డీఏం విజయ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మీసేవ కేంద్రాల నిర్వహణ, ధరల పట్టికలను పరిశీలించడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని నిర్వాహకులకు సూచించారు. తహసీల్ వద్ద ఉన్న ఆధార్ కేంద్రంలో సర్వీస్ నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతుండగా తిరిగి పునరుద్ధరించేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా రీ వెరిఫికేషన్ చేశారు. త్వరలోనే ఆధార్ సేవలు అందుబాటులోకి తెస్తామన్నారు. ఆయన వెంట నాయబ్ తహసీల్దార్ రాహుల్‌చంద్రవర్మ, గిర్దావర్ కీసరి రాజు, మీసేవ నిర్వాహకులు గంట సర్వేశ్వర్‌రావు, పోడెం సంతోష్, కుర్సం ప్రసాద్, అయ్యోరు కవిత, రెవెన్యూ సిబ్బంది కుందమల్ల నాగరాజు ఉన్నారు.

రామప్పలో మేడారం భక్తుల సందడి

వెంకటాపూర్, ఫిబ్రవరి 10 : రామప్ప దేవాలయం శనివారం మేడారం భక్తులతో సందడిగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి 10 వేల మంది పర్యాటకులు, మేడారం సందర్శనకు వెళ్లే భక్తులు, పలువురు అధికారులు రామప్పను సందర్శించారు. ఈ సందర్భంగా రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేయగా పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించారు. అనంతరం రామప్ప సరస్సులో బోటింగ్ చేశారు.

17న జడ్పీ సర్వసభ్య సమావేశం

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 10 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 17న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంజూర్‌నగర్ సింగరేణి ఇల్లందు క్లబ్ హౌస్‌లో ఉదయం 10 గంటలకు జరగనున్న సమావేశానికి సభ్యులు సకాలంలో హాజరు కావాలని, సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో రావాలని ఆమె సూచించారు.

పునరావాస స్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో

మల్హర్, ఫిబ్రవరి 10 : జెన్‌కో భూ ఉపరితల బొగ్గు గనుల తవ్వకాల్లో భాగంగా తాడిచర్ల ఓసీపీ పరిధిలోకి వెళ్లిన కాపురం, తాడిచర్ల ఎస్సీ కాలనీ వాసులకు తాడిచర్ల గ్రామంలో కేటాయించిన పునరావాస స్థలాన్ని శనివారం భూపాలపల్లి ఆర్డీవో రమాదేవి సందర్శించారు. రోడ్లు, డ్రైనేజీలతో పాటు వసతులను పరిశీలించారు. కాపురం గ్రామస్తులను తరలించే ప్రక్రియలో భాగంగా పునరావాస కాలనీలో పనులు పూర్తయ్యాయా? లేదా? అనేది తనిఖీ చేయడంతో పాటు మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ సరిత తదితరులున్నారు.

చేతి వృత్తిదారుల కోసమే విశ్వకర్మ పథకం

ములుగురూరల్, ఫిబ్రవరి 10 : కేంద్ర ప్రభుత్వం చేతి వృత్తిదారుల కోసం విశ్వకర్మ పథకాన్ని ప్రవేశపెట్టిందని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీని ద్వారా కళాకారుల నైపుణ్యాలను పెంపొందించే విధంగా శిక్షణ ఇవ్వడంతో పాటు పరికరాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తయారు చేసిన ఉత్పత్తులను సులభతరంగా మార్కెటింగ్ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సురేశ్, ఏడీ శివరాంప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ టీ రవి, బీసీ సంక్షేమ శాఖ అధికారి లక్ష్మణ్, చేతి వృత్తి కళాకారులు పాల్గొన్నారు.

రహదారుల పరిశీలన

కాటారం, ఫిబ్రవరి10 : మండలంలోని కాటారం–మంథని రహదారితో పాటు పలు రోడ్లను ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జి ఈఎన్‌సీ, ఈసీ (స్టేట్ రూరల్ రోడ్స్) మోహన్ నాయక్ శనివారం పరిశీలించారు. ఈ నెల 13న మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు బస్సుల్లో ఎమ్మెల్యేలను తీసుకెళ్లనున్నట్లు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో అధికారులు అలర్ట్ అయ్యారు. వరంగల్, కరీంనగర్ వైపు నుంచి మేడిగడ్డకు వెళ్లే రోడ్లపై ఎలాంటి గుంతలు లేకుండా యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని ఆదేశించారు. మేడిగడ్డ బ్యారేజీతో పాటు సమీపంలోని హెలిప్యాడ్‌ను సైతం పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఈ నాగేందర్‌రావు, ఈఈ వెంకటేశ్, డీఈఈ రమేశ్, ఏఈ అవినాశ్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి : పలువురికి గాయాలు

వెంకటాపూర్, ఫిబ్రవరి 10 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా, పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని లింగాపూర్ గ్రామ స్టేజి వద్ద శనివారం సాయంత్రం జరిగింది. ఎస్సై చల్ల రాజు, స్థానికుల కథనం ప్రకారం.. మేడారంలో చిరు వ్యాపారం చేసేందుకు హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన లోనికి తరుణ్ (22) టాటా ఏస్ వాహనంలో సామగ్రి తీసుకొని వెళ్తున్నాడు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌కు చెందిన ఐదుగురు మేడారం నుంచి ములుగు వైపు స్కార్పియో వాహనంలో వస్తున్నారు. ఈ క్రమంలో ముందు ఉన్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ఘటనలో డ్రైవర్ తరుణ్ క్యాబిన్‌లో ఇరుక్కుని అక్కడికక్కడే మృతిచెందాడు. స్కార్పియో వాహనంలో ఉన్న ఎర్రగడ్డ వెంకన్న, కొండలు తీవ్రంగా గాయపడగా మిగతా ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ములుగు ఏరియా దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నరు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 10 : మేడారం జాతరలో వ్యాపారుల నుంచి తైబజార్ ఏర్పాటు చేయకుండానే అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పులిశె బాలకృష్ణ ఆరోపించారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం వద్ద సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. టెండర్ నిర్వహించకుండా వ్యాపారుల నుంచి అధికారులు డబ్బులు వసూలు చేయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. టెండరు ద్వారా యువతకు అప్పగిస్తే కనీసం 30 మంది వరకు ఉపాధి పొందే అవకాశం ఉందన్నారు. టెండరు ప్రక్రియకు ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు అడ్డుపడుతున్నారని ఆయన ఆరోపించారు. వెంటనే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

29 వరకు రేషన్ కార్డు ఈకేవైసీకి గడువు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 10 : రేషన్ కార్డులోని సభ్యులు తమ ఈకేవైసీని ఈ నెల 29 వరకు పూర్తి చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నర్సింహారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆహార భద్రత కార్డు కలిగిన లబ్ధిదారులందరూ దగ్గరలోని రేషన్ షాపుల్లో ఈకేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని ఆయన సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

LOANS

★వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇప్పించబడును. Cibil అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు, హన్మకొండ. సెల్: 8790379618. NTW-5689

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455. NTW-323107

REAL ESTATE

ప్లాట్లు కొనబడును

★హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, పసుమాముల, రామోజీ, కోహెడ, సాగర్ పంప్, గుంతపల్లి, బాటసింగారం, తూప్రాన్‌పేట్, మల్కాపురం, పోచంపల్లిలో ప్లాట్లు కొనబడును. J.సుధాకర్ గౌడ్: 9948172307, 9390846522. NT-313886

HOUSE FOR SALE

★Prime Location, Near Water Tank, Nakkalagutta, Hanamkonda 427 Sq.yds. House for Sale, Cont: 9951635544, 8106263785. NTW-323208

లీజుకు ఇవ్వబడును

★నర్సంపేటలోని మల్లంపల్లి మెయిన్‌రోడ్డుకు 5500 Sft. గల స్థలంలో గ్రౌండ్ ఫ్లోర్ లీజ్‌కు ఇవ్వబడును. మాల్స్, షోరూమ్స్, ఆఫీసులకు, బ్యాంకులకు మొదలగు వాటికి లీజ్‌కు ఇవ్వబడును. పూర్తి వివరాలకు సంప్ర: 9346476574. NTW-154646

COMMERCIAL FOR SALE

★సికింద్రాబాద్, S.D. రోడ్, స్వప్నలోక్–సూర్యకిరణ్ కాంప్లెక్స్, 500 Sft., ఆఫీస్/గోడౌన్, 5వ అంతస్తు, సపరేట్ బాత్‌రూమ్, లిఫ్ట్/పార్కింగ్ కలిగిన కమర్షియల్ స్పేస్ అమ్మకం కొరకు కలదు. సెల్: 9246242210. NT-319436

మద్యం (ఆల్కహాల్) మాన్పించబడును

★త్రాగుడు (ఆల్కహాల్) & సిగరెట్, గుట్కా మానండి, మాన్పించండి. త్రాగేవారికి తెలియకుండా ఆయుర్వేద మందుతో మాన్పించవచ్చు. సైడ్ ఎఫెక్ట్స్ లేవు. కేంద్రీయ ఆయుర్వేద. ఫోన్: 9652899899. NT-319957

CHANGE OF NAME

★I, PINGILI JAGAN NMOHAN REDDY, R/o. 2-7-56/B2, Suchi Residency, Excise Cly., Subedari, Hanamkonda, Warangal Urban, TS-506 001. Changed My Name as PINGILI JAGANMOHAN REDDY, S/o. Pingili Venkat Reddy. NT-311608

★I, PINGILI PRAVEEN KUMAR REDDY, R/o. 2-7-56/B2, Suchi Residency, Excise Cly., Subedari, Hanamkonda, Warangal Urban, TS-506 001. Changed My Name as PINGILI PRAVEEN REDDY, S/o. Pingili Jaganmohan Reddy. NT-311608

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA	WARANAGAL
9182777563	9182777556
9182777618	9182777557
9182777213	9182777558

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565